పాడిరైతుల శ్రేయస్సే హెరిటేజ్ ధ్యేయం

విశాలాంధ్ర-అచ్యుతాపురం: పాడిరైతుల శ్రేయస్సే హెరిటేజ్ డెయిరీ ధ్యేయమని మేనేజర్ కూంద్రపు శేషు అన్నారు. నారప్పపాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడిరైతు పాడి ఆవు కొన్ని రోజులు క్రితం మృతి చెందడంతో పాడిరైతు లాలం రమేష్ కు 40 వేలు చెక్ ను మేనేజర్ కూంద్రపు శేషు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులకు సంవత్సరానికి రెండుసార్లు బోనస్ ఇస్తున్నామని , ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు . పాడిరైతుల పశువులకు రాయితీపై కృత్రిమ గర్భాధారణ రూ. 50 , కృత్రిమ గర్భాధారణ (ఆడదూడ జన్మించుటకు) రూ. 500 కు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు ఎల్ నాయుడు , ఎల్ శ్రీనివాసరావు, అప్పారావు, ప్రసాద్, దేవి, సత్తిబాబు తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

కార్మికులు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ

విశాలాంధ్ర-చోడవరం : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రి ల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, ఫెస్ట్ కంట్రోల్ కార్మికులకు బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏ.పి. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద బుదవారం ధర్నా చేశారు. కార్మిక నేత లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వం జీ.వో ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని, బకాయిపడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఖాతాలో పి.ఎఫ్, ఈ.ఎస్.ఐ డబ్బులు తిన్న కాంట్రాక్టర్లు పై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని, వారి కాంట్రాక్ట్ లైసెన్సు రద్దు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేయలేని పక్షం లో త్వరలో ఛలో సి.యం కార్యాలయం కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో కోటేశ్వరరావు, కుమారి, లక్ష్మి, నూకరాజు, నూకరత్నం పాల్గొన్నారు.

పెదముషిడివాడ హౌసింగ్ లేఅవుట్ ను సందర్శించిన విశాఖ జిల్లా కలెక్టర్...

విశాలాంధ్ర-పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పెదముషిడివాడ హౌసింగ్ లేఅవుట్ ను విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ బుధవారం ఉదయం సందర్శించారు. ఈ క్రమంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. అక్కడ స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా అక్కడ పనులకు స్థానిక ప్రజల నుంచి ఆటంకం కలిగిన నేపథ్యంలో బుధవారం సంబంధిత లేఅవుట్ ను సందర్శించి అక్కడి పరిస్థితులను గమనించారు. పనులకు ఆటంకం కలిగిస్తున్న స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆయన దానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ ఏర్పాటు చేసేందుకు భూ సమీకరణ చేశారని, దానికి బదులుగా స్థానికులకు వేరే చోట స్థలం కేటాయించారని అయితే వాటికి ఇంకా రిజిస్ట్రేషన్ కాలేదని కలెక్టర్ కు వివరించారు. వీలైనంత త్వరగా తమ భూములకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని విన్నవించుకున్నారు. సావధానంగా విన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అక్కడి నుంచే అనకాపల్లి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడిన ఆయన సంబంధిత సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ప్రజలతో కాసేపు మాట్లాడిన విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఇళ్ల నిర్మాణాల పనులకు ఆటంకం కలిగించవద్దని, అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. పర్యటనలో ఆయన వెంట విశాఖపట్టణం గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, పరవాడ తహశీల్దార్, హౌసింగ్ ఏఈలు, జేఈలు తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలో మేజర్ పంచాయతీ తిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధి కోనవానిపాలెం గ్రామంలో రోడ్ల నిర్మాణానికి సర్పంచ్ కర్రి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. స్థానిక పంచాయతీ నిధుల నుండి సుమారు 5 లక్షల రూపాయలు తో మూడు రోడ్ల నిర్మాణానికి నిర్ణయించారు. దీంతో వాటి నిర్మాణానికి సర్పంచ్ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యుడు సింహాద్రి యాదవ్ వైసీపీ నాయకులు దుర్గ బాబు, లోవరాజు, అల్లు నూకరాజు, బాబ్జి, సూరిబాబు, అప్పారావు, నూకరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అగ్రహారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు గ్రామీణ ఉపాధి హామీ పథకం లో భాగంగా సుమారు పది లక్షల రూపాయలతో రెండు సిమెంట్ రోడ్లు నిర్మించడం జరిగింది. అదేవిధంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కొరకు 30 లక్షల రూపాయలు మంజూరు కావడంతో ఆ పనులను బుధవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సహకారంతో మండల నాయకుల ఆధ్వర్యంలో ఈ పనులను చేపట్టడం జరుగుతుందని స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం మండల తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, గ్రామ శాఖ అధ్యక్షులు బండి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దీపం లబ్ధిదారులకు ఇంటి వద్దే ఈకెవైసీ

-సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు 1967

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : దీపం 2 పథకం లబ్ధిదారులకు అవసరమైన ఇ కె వై సీ ప్రక్రియ గ్యాస్ డెలివరీ బాయ్ ల ద్వారా లబ్ధిదారుని ఇంటివద్దే ఉచితంగా చేయించుటకు చర్యలు తీసుకున్నట్లు జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా అర్హులు అయిన పేద కుటుంబముల వారికి సంవత్సరానికి మూడు (3) గ్యాస్ సిలిండర్ లు ఉచితంగా అందజేస్తున్న దీపం 2 పథకాన్ని అక్టోబరు 31 అనకాపల్లి జిల్లాలో అమలుచేస్తున్నట్లు జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి తెలిపారు. ఈ పథకంలో ప్రజల సౌకర్యార్ధం మరి కొన్ని వెసులుబాట్లు కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం క్రింద మొదటసారి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందగోరు లబ్ధిదారులు అక్టోబరు 29 తేది నుండి 2025 సంవత్సరం మార్చి 31 తేది వరకు తమ గ్యాస్ ఏజెన్సీ వద్ద బుకింగ్ చేసుకున్న ఎడల, మొదటి విడత ఉచిత సిలిండర్ సరఫరా జరుగునని తెలియజేసారు. కావున లబ్ధిదారులు ఈ అవకాశమును వినియోగించుకోవాలన్నారు. డెలివరీబాయ్ వినియోగదారుని ఇంటికి గ్యాస్ తెచ్చినప్పుడు ఖాళీ గ్యాస్ సిలిండర్ సిద్ధముగా ఉంచుకోవాలని, లబ్ధిదారుడు ఈ పథకము క్రింద తీసుకున్న గ్యాస్ సిలిండర్ ఇతరులకు ఇవ్వరాదని, వారు మాత్రమే తమకు వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి వినియోగదారుడు ఇంటి వద్దే "కేవైసీ" ప్రక్రియ గ్యాస్ డెలివరీ బాయ్ ద్వారా జరుగునని, అందుకు ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఈ దీపం-2 పథకం పై లబ్ధిదారులు తమకేమైనా అసౌకర్యము లేదా సూచనలు లేదా ఆక్షేపణలు తమ సంబందిత వార్డ్ లేదా గ్రామ సచివాలయము యందు లేదా టోల్ ఫ్రీ నంబరు 1967 ఫోన్ చెసి తెలియజేస్తే సత్వర చర్యలు తీసుకోనబడునని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆర్ధికంగా మేలు చేయుటకు ఉద్దేశించిన ఈ పథాకాన్ని లబ్ధిదారులు వినియోగించుకొని ఎటువంటి అవకతవకలకు గాని, "బ్లాక్ మార్కెట్" కు తరలించడం గాని పాల్పడరాదని జిల్లాలోని లబ్ధిదారులు అందరుకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

రైతాంగ సమస్యలపై మరో పోరాటానికి సిద్ధంకండి

18 సచివాలయాల్లో వినతి పత్రాలు

ఏ.పి.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

విశాలాంధ్ర-చోడవరం : అపరిష్కృతంగా ఉన్న రైతాంగం సమస్యలపై మరో రైతు పోరాటానికి సిద్ధం అవ్వాలని ఏ.పి.రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అవలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుదవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాలు మేరకు చోడవరం చుట్టుపక్కల సుమారు 18 గ్రామ సచివాలయాల్లో రైతాంగం సమస్యలపై వినతి పత్రం అందజేశామన్నారు. నకిలీ పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు అమ్ముతున్న దుకాణాలపై కనీస తనిఖీలు కరువయ్యాయని అన్నారు. నకిలీ పురుగు మందులు, ఎరువులు వాడకంతో జిల్లా వ్యాప్తంగా రైతాంగం విపరీతమైన నష్టాల్లో కూరుకు పోయారని తెలిపారు. నకి'లీల' పై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకొవాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర లో ఎన్ని సాగునీటి వనరులు వున్నప్పటికీ వాటి అభివృద్ధి పై పాలకులు, ప్రభుత్వ అధికారులు తగిన శ్రద్ద చూపకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ప్రధాన చెరువులు, గెడ్డ వాగులు తదితర సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తే రెండు పంటలు పండి సస్య శ్యామలం అవుతాయని తెలిపారు. అధికార కూటమి ప్రభుత్వం పెద్దలు, పాలకులు, ఇరిగేషన్ అధికారులు తక్షణమే ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం సమస్యలు పై స్పందించని ప్రభుత్వానికి అన్నదాతల ఆక్రోశానికి బలి కాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు, వ్య.కా.సం. సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాద స్థలంలో విద్యుత్ కనెక్షన్ పై సర్వత్రా చర్చ

విశాలాంధ్ర-పాయకరావుపేట: పంచాయితీ అధికారులు పంచాయతీ స్థలంగా చెప్పుకుంటున్న స్థలంలో పంచాయతీ అనుమతి లేకుండా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంపై సర్వత్ర చర్చ జరుగుతుంది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న సర్వే నెంబర్ 132/ 3బి లో గతంలో లేఅవుట్ వేసిన యజమానులు పంచాయితీకి సుమారు 408 గజాల స్థలాన్ని కేటాయించినట్లు పంచాయతీ పాలకవర్గ సభ్యులు చెబుతున్న మాట. ఇందులో కొంత భాగంలో సిమెంట్ పరికరాలు తయారు చేసుకునే వ్యక్తి వ్యాపారం చేసుకుంటూ పంచాయితీకి అద్దె చెల్లిస్తున్నారు. మిగిలిన కొంత భాగం గతంలోనే ఆక్రమణకు గురైనట్లు పంచాయతీ పాలకవర్గ సభ్యులు తెలుపుతున్నారు. పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకున్న వారు ఏకంగా ఆ స్థలంలో నిర్మాణాలు చేసుకునేందుకు పంచాయతీకి ప్లాన్ అప్రూవల్ కు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అప్రమత్తమైన పాలకవర్గం ప్లాన్ అప్రూవల్ నిలిపివేస్తూ ఆ స్థలం పంచాయతీ స్థలమని తేల్చి చెప్పారు. అయితే స్థలం తమదే అంటూ పంచాయితీ చెప్పుకొస్తున్న స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు వారికి చెందిన స్థలంగా బోర్డులు పెట్టారు. ఇది జరిగి రెండేళ్లు గడుస్తున్నా ఎవరు కూడా ఒక అడుగు ముందుకు వేయలేదు. అయితే ఏడాది క్రితం వివాద స్థలంలో విద్యుత్ అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఈ విషయాన్ని తాజాగా తెలుసుకున్న పంచాయతీ పాలకవర్గ సభ్యులు విద్యుత్ ఏఈ ని విద్యుత్ కనెక్షన్ పై ప్రశ్నించారు. తాను కొత్తగా విధుల్లో చేరానని, విద్యుత్ కనెక్షన్ ఎవరిచ్చారు అనేది తెలియదు అని తెలిపారు. దీంతో పంచాయితీ స్థలంలో ఉన్న విద్యుత్ కనెక్షన్ ను ఎవరు సిఫార్సు చేస్తే ఇచ్చారో తెలపాలని, పంచాయతీ స్థలంలో ఉన్న విద్యుత్ కనెక్షన్ తొలగించాలని పాలకవర్గ సభ్యులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అయితే లేఅవుట్ వేసిన యజమానుల కుటుంబ సభ్యులు పంచాయితీకి కేటాయించిన స్థలాన్ని ఇతరులకు అమ్మేశారని అందరూ బాహాటంగా చర్చించుకుంటున్నారు.

పూరిల్లు దగ్ధమైన ఘటనలో కుటుంబానికి కూటమి నాయకుల ఆర్థిక సాయం

విశాలాంధ్ర-మాడుగుల: ఇటీవలే అగ్నిప్రమాదం గురైన ఎల్.పొన్నవోలు గ్రామంలో పాము కన్నబాబు ఇల్లు అగ్ని ప్రమాదం గురైంది. ఈ కుటుంబాన్ని కూటమి నాయకులు సందర్శించి మేమున్నామంటూ వాళ్ళ ఆర్థిక సహాయాన్ని అందించారు టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు యన్నశెట్టి సత్యారావు, ప్రధాన కార్యదర్శి గండి పడాల రమేష్ బాబు వార్డ్ మెంబర్ యువ నాయకులు కొరెడ్ల శ్రీనివాసరావు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు ఈశ్వరరావు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కామిశెట్టి గణేష్ తదితర నాయకులను ఆ కుటుంబాన్ని 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తగు న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు.

పెదముషిడివాడలో రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా!

విశాలాంధ్ర-పరవాడ: పెదముషిడివాడలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతుంది. పట్టపగలే కొండలను తొలిచేస్తూ మట్టిని మనీగా మార్చేస్తున్నారు. మండలంలో గ్రావెల్‌కున్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకొని గ్రావెల్ మాఫియా అగడాలు పెచ్చుమీరి పోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అనకాపల్లి మైనింగ్‌శాఖాధికారులను మచ్చిక చేసుకుని రెచ్చిపోయిన మైనింగ్ మాఫియా ఆగడాలు ఇప్పటికీ ఇంకా కొనసాగుతున్నాయి. మైనింగ్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు గ్రావెల్ మాఫియాను పట్టించుకోక పోవడంతో రాత్రి, పగలనక మట్టిని కొట్టేస్తున్నారు. పెదముషిడివాడ సర్వేనెంబర్ 409లో కొండను తవ్వేసి మట్టిని ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండానే తవ్వకాలు చేపడుతున్నారు. ఈ మట్టిని భూ కబ్జాలకు వినియోగిస్తున్నారు. వాగులను సయితం అక్రమ గ్రావెల్‌తో కప్పేస్తున్నారు. ఇటువంటి వాటిని గుర్తించి రాయల్టీని పెనాల్టీతో సహా వసూలు చేయాల్సిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్ పెదముషిడివాడ వైపు చూడటం లేదు. మైనర్ మినరల్ గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవల్సిన మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు కనీస చర్యలు చేపట్టక పోవడంతో మైనింగ్ మాఫియా రెచ్చిపోతుంది. ఇకనైనా అధికారులు మేల్కొని గ్రావెల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐదు చోరీ కేసుల్లో ముగ్గురు పాత నేరస్తులు అరెస్ట్

రూ.2,31,024 విలువగల చోరీ సొత్తు స్వాధీనం

ఎస్పి తుహిన్ సిన్హా

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: జిల్లాలోని పాయకరావుపేట, పరవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన 5 చోరీ కేసులలో ముగ్గురు పాత నేరస్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2,31,024/- విలువగల చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో చోరీ వివరాలను ఆయన వెల్లడించారు. పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జరిగిన చోరీ కేసుల్లో విశాఖపట్నం ,మహారాణి వీధి, మర్రిపాలెంలో ఉంటున్న ఏ (1) (సొంత ఊరు గ్యాస్ కంపెనీ రోడ్డు, బాలాజీ నగర్, నిడదవోలు వెస్ట్ గోదావరి జిల్లా.)ఇతని పై ఇప్పటివరకు కంచరపాలెం, విజయనగరం, పెందుర్తి, కడియం, శ్రీకాకుళం ప్రాంతాల్లో 48 చోరీ కేసుల్లో నిందితుడు. వీటిలో 20 కేసుల్లో శిక్ష అనుభవిస్తున్నాడని తెలిపారు. అలాగే ఏ (2) పాయకరావుపేట మండలం, గేలం వీధి కి చెందిన నిందితుడు చెడు వ్యసనాలకు లోనై దొంగతనాలు చేస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు కేసులు నమోదయ్యాయి. తెలిపారు. వీరి వద్ద నుంచి 4 కేసుల్లో 8 గ్రాముల బంగారం, 2.120 కేజీల వెండి, 2 కేజీల ఇత్తడి, 15 జతల బట్టలు, ఒక హెూమ్ థియేటర్, 2 టీవీలు 1,240 కేజీల బరువు తూచే ఇనప గుళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జరిగిన చోరీ కేసులో అనకాపల్లి మండలం మారేడుపూడి పంచాయతీ, గొన్నువానిపాలెం గ్రామానికి చెందిన పాత నేరస్తుని అదుపులోకి తీసుకోగా అతని వద్ద నుండి బంగారు పుస్తెలతాడు 2 తులాలు, చేతివేలి బంగారం ఉంగరం చిన్నది, ఒక జత వెండి పట్టీలు 10 తులాలు , ఒక మొబైల్ ఫోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో 2 మోటార్ సైకిల్ చోరీ కేసులు పరవాడ లో కేసులు కూడా ఉన్నట్లు తెలిపారు. రెండు పోలీస్స్టేషన్లో పరిధిలో నమోదైన ఐదు కేసులలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎల్.మోహన్ రావు, పరవాడ సబ్ డివిజన్ డి.ఎస్.పి కె.వి.సత్యనారాయణ, పరవాడ ఇన్స్పెక్టర్ మల్లికార్జున రావు, సిసిఎస్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, పాయకరావుపేట ఇన్స్పెక్టర్ అప్పన్న, పాయకరావుపేట ఎస్సై పురుషోత్తం, పరవాడ ఎస్సై కృష్ణారావు ఇతర అధికారులు సిసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాకలో సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టండి

విశాలాంధ్ర-మునగపాక: టిడిపికి కంచుకోటగా నిలిచే మునగపాకలో సభ్యత్వ నమోదు పై దృష్టి పెట్టాలని ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు.మునగపాకలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం వద్ద బుధవారం ఆయన ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక గ్రామంలో సభ్యత్వ నమోదు ఎక్కువగా చేయాలని, తెలుగుదేశం పార్టీకి మునగపాక గ్రామం కంచుకోట అని, ఈ గ్రామం నుండి ఎక్కువ సంఖ్యలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును చేయించాన్నారు. టీడీపీ సిద్ధాంతాలను, ఆశయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసలి నాయుడు,క్లస్టర్ ఇంచార్జ్ మొల్లేటి సత్యనారాయణ,రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి డొక్కా నాగభూషణం,గ్రామ శాఖ అధ్యక్షులు దాడి శివ,యూనిట్ ఇంచార్జ్ విల్లూరి నర్సింగరావు, దాడి అప్పలనాయుడు,పెంటకోట శ్రీరామమూర్తి, వెలగా మురళి,శరగడం జగన్,బీలా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి పంటకు భీమా పథకం

ఉద్యానవన అధికారి ఎస్.శిరీష

విశాలాంధ్ర-నాతవరం: మండలంలో రైతాంగం సాగు చేస్తున్న జీడి తోటలకు ప్రభుత్వం స్వచ్ఛంద భీమా పథకాన్ని అమలు చేస్తుందని ఉద్యానవన అధికారి ఎస్.శిరీష తెలిపారు. బుధవారం నాతవరంలో ఉద్యానవనాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం 2024-25 సంవత్సరంలో జీడి సాగు రైతులకు బీమా పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమైందని, అధిక వర్షాలు, అధిక తేమ ఉష్ణోగ్రత వలన దెబ్బతిన్న తోటలకు ఈ బీమా పథకం వర్తిస్తుందన్నారు. ఎకరం విస్తీర్ణంలో దెబ్బతిన్న తోటకు రూ 30,800 భీమా వస్తుందని, అందుకు గాను రైతాంగం, ముందుగా అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ వారికి ప్రీమియం కింద రూ.1540 చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ప్రీమియంను రైతాంగం గ్రామ సచివాలయం, నేషనల్ కార్పొరేషన్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా చెల్లించవచ్చుని అన్నారు. అంతేకాక జీడి పంటలపై బ్యాంకుల్లో రుణం పొందిన రైతులు స్వచ్ఛంద డిక్లరేషన్ సమర్పిస్తే సరిపోతుంది అన్నారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రోగులతో ఆసుపత్రులు కిటకిట

విశాలాంధ్ర-కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ బుధవారం రోగులతో కిటకిటలాడింది. ఉదయం నుండి రోగులు అధిక సంఖ్యలో హాస్పటల్ చేరుకొని వైద్య సేవలు కొరకు లైన్లో నిలబడ్డారు. ఇద్దరు డాక్టర్లు ఒకే గదిలో రోగులకు వైద్య సేవలు అందించడం వలన రోగులు పలు ఇబ్బందులు పడ్డారు. రోగులంతా ఒకే లైనులో నిలబడడం వల్ల తోపులాట చోటు చేసుకొని గందరగోళానికి దారితీసింది. ఇద్దరు డాక్టర్లు వేరువేరు గదుల్లో వైద్య సేవలు అందించినట్లయితే రోగుల మధ్య చూపులాట వాగ్వాదాలు ఉండవని పలువురు అభిప్రాయపడ్డారు. హాస్పటల్ సూపరింటెంట్ తగు చర్యలు తీసుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

వైసీపీ నాయకుల అరెస్ట్, పోలీస్ స్టేషన్ కి తరలింపు

విశాలాంధ్ర-కోటవురట్ల: నర్సీపట్నంలో వైసీపీ నాయకులు తలపెట్ట బోయే నిరసన కార్యక్రమానికి బయలుదేరిన వైసిపి నాయకులను పెదబొడ్డేపల్లి వద్ద అరెస్టుచేసి కోటవరట్ల పోలీస్‌స్టేషన్ కు తరలించినట్లు స్థానిక ఎస్సై రమేష్ అన్నారు. నర్సీపట్నం లో ఇసుక వ్యవహారంలో చోటు చేసుకున్న సంఘటనకు నిరసనగా బుధవారం నర్సీపట్నంలో ధర్నా నిర్వహించాలని వైసిపి శ్రేణులు నిర్ణయించుకున్నాయి. అందులో భాగంగా నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలంతా ర్యాలీగా బయలుదేరి నర్సీపట్నం వెళ్తుండగా పెద్ద బొడ్డేపల్లి గురుకుల పాఠశాల సమీపంలో వైసిపి శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో 21 మందిని కోటవురట్ల పోలీస్‌స్టేషన్ కి తరలించారు. తమను పోలీసులు అక్రమం గా అన్యాయంగా అరెస్టు చేశారని వైసీపీ శ్రేణులు ఆరోపించాయి.

శ్రీ ప్రకాష్ లో ఉల్లాసంగా ఉత్సహంగా రిమ్-జిమ్

విశాలాంధ్ర-పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల నందు రిమ్ జిమ్ -2024 పోటీలు విద్యార్థుల మధ్య ఉల్లాసంగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ పోటీల నందు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు పాయకరావుపేట, తుని, అన్నవరం శాఖల విద్యార్థులు సుమారు 4500 మంది పాల్గొన్నారు. రిమ్-జిమ్ కార్యక్రమంలో సాహిత్యం, సంగీతం, ఆటలు, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ వంటి అనేక అంశాల మీద జూనియర్, సబ్ జూనియర్, సీనియర్, సూపర్ సీనియర్ విభాగాలలో 29 రకాల పోటీలు నిర్వహిస్తున్నామని, ఇవి విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను వెలికి తీసేందుకు ఉపయోగపడతాయని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు.

పెదముషిడివాడ రెవెన్యూ సభకు 235 అర్జీలు

అక్రమాలపైనే ఎక్కువగా దాఖలైన ఫిర్యాదులు

విశాలాంధ్ర-పరవాడ: పరవాడ మండలం పెదముషిడివాడలో బుధవారం జరిగిన రీ సర్వే గ్రామ రెవెన్యూ సభకు రికార్డ్ స్థాయిలో అర్జీలు దాఖలయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన రీసర్వే తప్పుల తడకగా చేసినట్లు పలువురు తహసీల్దార్ అంబేద్కర్ దృష్టికి తీసుకు రాగా.. వెబ్‌ల్యాండ్ లో తప్పులు, ల్యాండ్ పూలింగ్ లో అవకతవకలు, గెడ్డలు, వాగులు, చెరువులు, కొండ బంజర్లు తదితర ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అనధికార వెంచర్లు వంటి వాటిపై చర్యలు తీసుకోవాలని బంధం వెంకటరమణ, బర్ల శంకరరావు, చిప్పాడ రామారావు తదితరులు పిర్యాదు చేశారు. వీటిపై సమగ్ర విచారణ జరిపించి పంచాయతీలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అన్ని సమస్యలకు సంబంధించి మొత్తంగా 235 అర్జీలు అందినట్లు వీఆర్వో పృధ్వీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వోలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా సోషల్ ఆడిట్ నిర్వహించాలి : ఎంపీడీవో

విశాలాంధ్ర నక్కపల్లి : నక్కపల్లి మండలంలో 17 వ విడత గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన సామాజిక తనిఖీల కార్యక్రమం లో భాగంగా నిర్వహించే బాధ్యులు బాధ్యతగా నిర్వహించాలని ఎండిఓ దెందుకూరు సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సోషల్ ఆడిట్ విషయమై రాష్ట్ర సామాజిక తనిఖీలు విభాగం బాధ్యులు ఎం. నాగరాజు, డీఆర్పీలు కలసి మండలం లోని గ్రామాల్లో సామాజిక తనిఖీ ఏ విధంగా ప్రారంభించాలి అనే విషయంపై పూర్తిస్థాయిలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో దెందుకూరి సీతారామరాజు మాట్లాడుతూ మండలంలో ఎటువంటి చెడ్డ పేరు రాకుండా తనిఖీలు విభాగం కష్టించి పనిచేసి సరైన నివేదిక తయారు చేయాలని కోరారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ మాట్లాడుతూ సామాజిక తనిఖీల కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని అందుకు వీఆర్పీలు లు, పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ ల రికార్డులు వారికి అందజేయాలని ఎస్ఆర్పిలు కోరారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్డి మజ్జి శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ జగన్, గ్రామీణ ఉపాధి పథకం ఏపీవో లు భాగ్యలక్ష్మి, ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

పెండింగ్లో ఉన్న విద్యా దీవెన, విద్యా వసతి ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర-అనకాపల్లి: విద్యా దీవెన విద్యా, వసతి , ఫీజు రీయింబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయాలంటూ భారత్ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించి అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం రమణ మాట్లాడుతూ. విద్యార్థులకు ఇవ్వవలసిన విద్యా దీవెన, వసతి రీయింబర్స్మెంట్లు , తల్లికి వందనం అమలు చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అలాగే వారి కాలేజీ మేనేజ్మెంట్ ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వమని అదే విధంగా సెమిస్టర్ పరీక్ష ఫీజును కట్టించుకోమంటూ విద్యార్థులను తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు అడ్డుకుంటున్నాయనివెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి పెండింగ్ ఉన్నటువంటి విద్యా దీవెన విద్యా వసతి ఫీజు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. లేనియెడల పెద్ద ఎత్తున విద్యార్థులను ఐక్యం చేసి భవిష్యత్తులో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం బాలాజీ ,డివిజన్ కార్యదర్శి ఎస్. నాగ రమణ, జిల్లా నాయకులు కృపా ఆనంద్, అర్జున్ నాయుడు, తరుణ్, లక్ష్మణ్ తదితరులు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాట బేఖాతర్

విశాలంధ్ర - అచ్యుతాపురం : అభిజిత్ ఫెర్రో ఎల్లోయిస్ కంపెనీ లే ఆఫ్ ఎత్తివేసినట్లు ఎమ్మెల్యే సుందరపు ప్రకటించడంతో కార్మికులందరూ విధులకు బుధవారం హాజరయ్యారు. కానీ కంపెనీ యజమాన్యం లే ఆఫ్ ఎత్తి వేస్తున్నట్లు నోట్ బోర్డ్ తీసివేయడం గాని, కార్మికులు డ్యూటీలకు పంపలేదు. దీనితో దిక్కుతోచని స్థితిలో కార్మికులు గేట్ బయట ఉండిపోయారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే మాటలు కూడా యాజమాన్యం బేఖాతారు చేయడం ఏమిటి అని ప్రశ్నించ్చారు . కార్మికులు 25 రోజులు గా రోడ్డు మీద ఉంటే ప్రభుత్వం, అధికారులు యాజమాన్యం మీద చర్య తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు . తక్షణమే అభిజిత్ యాజమాన్యం కార్మికులకు బోనసు, జీతాలు చెల్లించాలని చేయాలని డిమాండ్ చేశారు. చట్ట విరుద్ధంగా ప్రకటించిన లే ఆఫ్ ను ఎత్తివేసి కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము , గనిశెట్టి సత్యనారాయణ, కుంద్రపు సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లును వ్యతిరేకించండి: సీపీఎం

విశాలాంధ్ర - చోడవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్లును వ్యతిరేఖించాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం అయిన ఓ ప్రకటనలో ప్రజాసంఘాలు, వినియోగదారులకు పిలుపునిచ్చారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇబ్బంది కలిగించే స్మార్ట్ మీటర్లను వ్యతిరేఖించాలన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇబ్బంది కలిగించే స్మార్ట్ మీటర్లను వ్యతిరేఖించాలన్నారు.

ఆసుపత్రి సూపర్వైజర్గా త్రిమూర్తులు ఎంపిక పట్ల హర్షం

విశాలాంధ్ర -కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపర్వైజర్ గా జానకి త్రిమూర్తులను ఎంపిక చేయడం పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కోటవురట్ల ఎంపీటీసీ పివి సూర్యారవు జానకి శివ బత్తుల రామకృష్ణ జోగారావు తదితరులు త్రిమూర్తులను ప్రభుత్వ హాస్పిటల్ కి తీసుకువెళ్లి హాస్పటల్ సూపర్టెండెంట్ డాక్టర్ ప్రసాద్కి పరిచయం చేసి విధులలోకి తీసుకోవాలని కోరారు అనంతరం డాక్టర్లు నర్సులు సిబ్బందిని పరిచయం చేసుకున్నారు హాస్పటల్ సిబ్బందితో కలిసి అందరి సమన్వయంతో హాస్పటల్ కి మంచి పేరు తీసుకువస్తానని త్రిమూర్తులు అన్నారు.

బెల్ట్ షాపుపై దాడి
121 మద్యం బాటిల్స్ స్వాధీనం

విశాలాంధ్ర -అనకాపల్లి: మండలంలో తగరంపూడి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపుపై దాడి చేసినట్లు రూరల్ ఎస్సై సత్యనారాయణ తెలిపారు. గల్లా వరహాల బాబు అనే వ్యక్తి బెల్ట్ షాప్ నర్వహిస్తూ అక్రమ మద్యం అమ్ముతున్నట్లు తెలిసిందని తెలిపారు. ఈ దాడులలో 121 మద్యం క్వార్టర్ బాటిళ్ళను స్వాధీనం చేసుకొని వరహాల బాబును అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించామని తెలిపారు. ఈ దాడిలో ఏఎస్ఐ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేవు పోలవరం కైలాసగిరి మెట్లు మార్గంలో తుప్పల తొలగింపు

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన రేవు పోలవరం తీరంలోని కైలాసగిరి మెట్ల మార్గంలో తుప్పులను చెత్తాచెదారం స్థానిక యువకులు తొలగించారు. కొత్త రేవు పోలవరం టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు, టిడిపి యువ నాయకుడు కోవిరి బంగారి ఆధ్వర్యంలో పలువురు యువకులు సహకారంతో మెట్లు మార్గంలోని చుట్టుపక్కల చెత్తాచెదారం తొలగించడంతోపాటు పరిశుభ్రం చేశారు. కార్తీకమాసం కావడంతో ఈ తీరానికి పర్యటకులు సందర్శించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం చేపట్టడం వల్ల పలువురు అభినందించారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

విశాలాంధ్ర-రాంబిల్లి: మండలంలో లాలంకోడూరు, గోవిందపాలెం గ్రామాలలో మండల వ్యవసాయాధికారిణి సి.హెచ్. సుమంత ఆధ్వర్యంలో బుధవారం నాడు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె రైతులకు జీడీ, కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్దతులపై అవగాహన కల్పించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ పశు కిసాన్, క్రెడిట్ కార్డుల గురించి తెలియజేశారు.జీడీ మామిడికి ఎకరానికి రూ.1540ల చొప్పున పంటల బీమా చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి ప్రియ, ఎహెచ్ఎలు మేరీ రత్నం, నాగేశ్వరరావు, వి.హెచ్ఎలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కెపి అగ్రహారంలో త్రాగునీటి బోరుకు శంకుస్థాపన

విశాలాంధ్ర- బుచ్చయ్యపేట: మండలంలో పలు గ్రామాలలో త్రాగునీటి కష్టాలు తీరుస్తున్న కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్పిటీసిల ఫోరం

అధ్యక్షులు దొండా రాంబాబు కే పీ అగ్రహారం గ్రామంలో వియ్యపు పోతురాజు వారి పాకలు వద్ద జడ్పిటిసి రాంబాబు చేతులు మీదుగా త్రాగునీటి బోర్కు కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అచ్చం నాయుడు, శ్రీను, ఉప సర్పంచ్ డి.మునిలి నాయుడు, జి.రమణ, జి.నూకరాజు, పి.రామునాయుడు, పి.భీమవరం సర్పంచ్ డిసిహెచ్ అప్పారావు, స్కూల్ చైర్మన్ గాంధీ, రమేష్, శ్రీను, శంకర్, జగన్, అప్పారావు, అప్పారావు (దోసు) బుజ్జి, దేముడు, అప్పారావు, పాపారావు, రమణ, అప్పారావు మెకానిక్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

కోణం, శిరిజాం గ్రామాలలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర-చీడికాడ : మండలంలోని శిరిజాం కోణం గ్రామాలలో వ్యవసాయ అధికారిని రమాదేవి ఆధ్వర్యంలో బుధవారం పొలంపిస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి చోడవరం వ్యవసాయ సహాయసంచాలకులు వీ రవీంద్రనాథ్ విచ్చేసారు ఈ సందర్భంగా వారు వ్యవసాయ యాంత్రికరణ రబి లో విత్తనాలు ఎరువులు సరఫరా, గురించి రైతులకు వివరించారు వరిలో సుడిదోమా

మానిపండు తెగులు నివారణ మందులు వినియోగం పై రైతులకు అవగాహన కల్పించారు ఈకార్య క్రమంలో సిబ్బంది వర్మ కామేష్ రావ్యాప్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి

విశాలాంధ్ర - నాతవరం: గ్రామాల అభివృద్ధి కేవలం కూటమి ప్రభుత్వంతోనే అని మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ అన్నారు. బుధవారం నాడు నాతవరంలో అధికార పార్టీ నాయకులు, మండల స్థాయి అధికారుల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ మాట్లాడుతూ మండలంలో సిసి రోడ్లు డ్రైనేజ్ పనులకు సుమారు ఏడు కోట్ల రూపాయలు నిధులు మంజూరై ఉన్నాయని, వీటిని ప్రతి గ్రామంలో అవసరం కొరకు రోడ్లు వేసుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. పంచాయతీలలో అభివృద్ధి పనులకు సర్పంచులు, అధికారులు సహకరించి ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, మాజీ జడ్పిటిసి కరక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసి దేవుడు,పారుపల్లి కొండబాబు, నేతల విజయ్ కుమార్, తెలుగు యువత అధ్యక్షుడు శెట్టిలోవ, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ శెట్టి నానాజీ,మాజీ ఎంపీటీసీలు అపిరెడ్డి మాణిక్యం, బంగారు సూరిబాబు, బిజెపి పార్టీ నాయకులు లాలం వెంకటరమణ, గవిరెడ్డి త్రినాథ్ ,పేరూరి బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

13న స్వయంభూ శ్రీ గౌరీశ్వరాలయంలో దీపోత్సవం

విశాలాంధ్ర -చోడవరం: రాష్ట్రంలోని స్వయం భూ దేవాలయాలు అన్నింటిలో అత్యంత మహిమాన్వితమైన చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం స్వయం భూ గంగా సమేత పురాణ గౌరీ పరమేశ్వరాలయం ప్రాంగణం నందు భక్తులచే సామూహికంగా దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈ.ఓ. ఎస్.వి.వి. సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ గూనూరు సురేష్, ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి చలపతిరావు, వెంకటరావులు బుదవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్తీక శుద్ధ ద్వాదశి తత్కాల త్రయోదశి పర్వదినం సందర్భంగా బుధవారం అనగా ఈ నెల 13 సాయంత్రం 6 గంటలకు " సర్వేజనా సుఖినోభవంతు "అను శుభ సంకల్పంతో కార్తీక దామోదరుడు శుభ ఆశీస్సులు ప్రతీ ఒక్కరికీ అందజేయాలనేది ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. శివాలయం ఉత్సవ కమిటీ, పట్టణంలోని భక్తులు, శివ, అయ్యప్ప స్వాములు, దాతల సహకారంతో 51000 (ఏభైఒక్క వేలు) దీపాలతో నిర్వహించే దీపోత్సవం కార్యక్రమంలో ప్రజలు అందరూ పాల్గొని కార్తీకంలో పార్వతి పరమేశ్వరుల కరుణ కటాక్షాలు పొంది, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన రీ సర్వే: తహశీల్దార్ నరసింహమూర్తి

విశాలాంధ్ర -నక్కపల్లి: అక్టోబర్ 17 నుంచి నవంబర్ 5 వరకు పలు రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రీసర్వే గ్రామ సభలు ప్రశాంతంగా ముగిసాయని తహశీల్దార్ ఆర్.నరసింహమూర్తి బుధవారం తెలిపారు. ఈ రీ సర్వే గ్రామాల్లో పలు రైతుల నుంచి భూములకు సంబంధించిన చిన్న చిన్న సవరణలు కూడిన 342 వినతి పత్రాలు అందాయని చెప్పారు. రిసర్వే కి సంబంధించిన పిటిషన్లు తోపాటు భూములకు సంబంధించిన పలు సమస్యలపై 48 పత్రాలు వచ్చాయని తెలిపారు. వచ్చిన వాటిని రెవిన్యూ కార్యదర్శిల సమక్షంలో పూర్తిస్థాయిలో రికార్డుల ఆధారంగా విచారణ జరిపి నవంబర్ నెలాఖరులోగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఆయనతోపాటు ఉపతాసిల్దార్ అన్నాజీ రావు, మండల సర్వేర్ సత్తిబాబు, ఇన్చార్జ్ ఆర్ ఐ కన్నబాబు, పలువురు విఆర్వోలు ఉన్నారు.

మాజీ మంత్రి సత్యనారాయణకు తుది వీడ్కోలు

విశాలాంధ్ర-చీడికాడ : మాడుగుల మాజీ ఎమ్మెల్యే రెడ్డిసత్యనారాయణ అంతక్రియలను నర్సీపట్నం ఆర్డీవో వివి రమణ అనకాపల్లి డి.ఎస్.పి శ్రావణి ఆధ్వర్యంలో అధికార లాంచనాలాతో పోలీసులు మూడు రౌండ్లు కాల్పులు జరిపి ఆయన స్వగ్రామం పెదగోగడలో బుధవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, జిల్లా అధ్యక్షుడు భత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు సత్యనారాయణ పార్థవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జిల్లా మండల గ్రామస్థాయి నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు అభిమానులు పాల్గొని తుది వీడ్కోలు పలికారు.